సామాజిక భవనాలకు మహర్దశ

- కాకినాడ రూరల్‌లో నిర్మాణాల జోరు
- సుమారు రూ.5 కోట్లతో చకచకా పనులు

కాకినాడ రూరల్: అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవనాల నిర్మాణాలు కాకినాడ రూరల్ మండలంలో జోరందుకున్నాయి. గత ప్రభుత్వం లోను, అంతకుముందు ప్రభుత్వంలోనూ పునాది, వివిధ దశల్లో నిలిచిపోయిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన కమ్యూనిటీ హాళ్లకు మహర్దశ పట్టింది. మండలంలో సుమారు రూ.5కోట్ల నిధులతో పనులు జోరుగా సాగుతున్నాయి, మండల పరిషత్, సీఎస్ఆర్, సీఎండీఎఫ్, ఎస్టీఎఫ్, గ్రామ పంచాయతీ నిధులతో పనులు చేపడుతున్నారు. వాకలపూడి గ్రామంలో శ్లాబ్ దశలో నిలిచిపోయిన మత్స్యకార సామాజిక భవన నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు విజ్ఞప్తి చేయడంతో ఆయన చొరవ తీసుకుని పనులు మొదలు పెట్టించారు. దీంతో భవన నిర్మాణం పూర్తయ్యింది. ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. తమ గృహాలలో వివాహాది శుభకార్యాలు, ఓణీ ఫంక్షన్లు, సామాజిక సమావేశాలకు ఇప్పటి వరకు ఇబ్బందులు పడ్డామని అన్నారు. తమకు సామాజిక భవనం అందుబాటులోకి వస్తే ఎంతో చేయూతగా ఉంటుందని వాకలపూడి మత్స్యకారులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పునాది దశలో నిలిచిపోయిన గౌడ కమ్యూనిటీ హాలు నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. యాదవ కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. పండూరులో ఎస్సీ సామాజిక భవన నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతుండగా, చీడిగలో బీసీ సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. తూరంగి, వాకలపూడి గ్రామాలలోను సామాజిక భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. వివిధ కారణాలుతో నిలిచిపోయిన నిర్మాణాలను ట్రాక్‌లోకి తీసుకువచ్చి నిర్మాణాలను పూర్తి చేస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



వాకలపూడిలో ప్రారంభానికి సిద్ధమైన మత్స్యకార సామాజిక భవనం

రూ.75 లక్షలతో మత్స్యకార భవనం

మండలంలోని వలసపాకల గ్రామంలో మత్స్యకారులు కోసం కోరమాండల్ సంస్థ తన సీఎస్ఆర్ నిధులు రూ.75 లక్షలు కేటాయించగా ఇటీవల ఎమ్మెల్యే కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ భూమి పూజ నిర్వహించగా పనులు వేగంగా చేపడుతున్నారు.



వాకలపూడిలో యాదవ కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులకు ఇటీవల ఏర్పాటు చేసిన శిలాఫలకం

నాణ్యతతో సామాజిక భవనాల నిర్మాణ పనులు

కాకినాడ రూరల్‌లో వివిధ సామాజిక భవనాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అసంపూర్తి భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తున్నాం. పనులు నాణ్యతతో చేపడుతున్నాం.
– వాసుదేవరావు, మండల ఇంజినీర్, కాకినాడ రూరల్

క్లుప్తంగా

18న గాన గంధర్వుల స్వరాభిషేకం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సీతారామరాజు స్మారక కళావేదిక, క్షత్రియ పరిషత్ సౌజన్యంతో ఈ నెల 18వ తేదీ సాయంత్రం గాన గంధర్వుల స్వరాభిషేకం పేరుతో సంగీత కచేరి నిర్వహించనున్నట్టు ఘంటసాల సంగీత కళాపీఠం కన్వీనర్ పంపన దయానందబాబు తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ, రెబల్ స్టార్ కృష్ణంరాజులకు నివాళులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంగీత అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

సామాజిక సేవలో ముందంజ



పాఠశాలకు సామగ్రి అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ చిన్నారావు

బాలాజీచెరువు: ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు సామాజిక సేవలో ముందుంటున్నామని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కేఎస్‌వీ చిన్నారావు పేర్కొన్నారు. మహిళా సాధికారిత కార్యక్రమంలో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురకుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పిల్లలకు అవసరమైన వస్తు సామగ్రి, సాంబమూర్తినగర్ మహర్షి సాంబమూర్తి బాలికల ఆశ్రమ పాఠశాలకు నిత్యావసర వస్తువులు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఉప ప్రాంతీయ అధికారి డీవీ రంగారావు, ప్రతినిధులు సూర్యకుమారి, రాధిక, అర్చన పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల కోసం వీల్ చైర్లు



వీల్ చైర్లు ప్రారంభిస్తున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చే విభిన్న ప్రతిభావంతుల సౌకర్యార్థం ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ వీల్ చైర్లను ఏర్పాటు చేసింది. వీటిని జేసీ ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ ప్రారంభించారు.

దేవస్థానం భూమిని కాపాడాలంటూ కలెక్టర్‌కు వినతి

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తురంగేశ్వరస్వామి దేవస్థానం భూమిని కొందరు అన్యాక్రాంతం చేస్తున్నారని, అధికారులు కాపాడాలంటూ దేవస్థానం మాజీ ధర్మకర్త గరికిన అప్పన్న సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి విన్నవించారు. పగడాలపేటలో తురంగేశ్వర స్వామి ఆలయానికి సర్వే నంబర్ 207/3లో 27.15 ఎకరాల భూమి ఉందని, దీనిలో 10 ఎకరాలు కౌలుకు ఇచ్చారన్నారు. మిగిలిన 14.15 సెంట్ల భూమి సముద్రతీరానికి వెళ్లే రహదారిలో పలుచోట్ల ఉండడం, సర్వే లేకపోవడంతో బహిరంగ వేలం కుదరడం లేదన్నారు. ఆలయానికి ఆదాయం వచ్చే విధంగా కౌలు వేలం పాట నిర్వహించాలని కోరారు. దీనిపై చర్యలు చేపట్టాలని దేవదాయ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

త్వరలో శెట్టిబలిజ మహానాడు

కాకినాడ సిటీ: కాకినాడ నగరంలో త్వరలో పార్టీలకు అతీతంగా శెట్టిబలిజ మహానాడు నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కండపల్లి వెంకటరమణ అన్నారు. స్థానిక రామారావుపేటలోని శెట్టిబలిజ హాస్టల్‌లో సోమవారం సంఘ సమావేశం జరిగింది. ఈ మహానాడులో పలు తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వైద్య ,ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ మాజీ చైర్మన్ యనమదల రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని వర్గాలకు సంవత్సరానికి రూ.10 వేలు ఇస్తోందని, కల్లు గీత కార్మికులకు కూడా ఈ ప్రయోజనం వర్తింపచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పితాని అన్నవరం మాట్లాడుతూ శెట్టిబలిజ సంఘీయులంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. నూతనంగా ఎన్నికైన తుని పట్టణ శెట్టిబలిజ సంఘ నాయకులను సత్కరించారు. సంఘ సభ్యులు పెద్దిరెట్టి వేంకటేశ్వరరావు, పెంకె రాజు, వాసంశెట్టి త్రిమూర్తులు, పాలిక నాని, పాలిక రమణ, పిల్లి శంకర్, ఎల్లబోయిన చిన్న, కాద శివరామకృష్ణ పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వంపై సమీక్ష

బాలాజీచెరువు: జనసేన నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్ ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వంపై సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ ఆన్‌లైన్ ద్వారా పార్టీ కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహించారు. సభ్యత్వ ఉపయోగాలు తెలియజేయాలని సూచించారు. పార్టీ నాయకులు వాసిరెడ్డి శివ, తలాటం సత్య పాల్గొన్నారు.

రేడియో వింటే కల్పనాశక్తి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

బాలాజీచెరువు: రేడియో వినడం ద్వారా విద్యార్థులకు కల్పనాశక్తి పెరుగుతుందని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం పేర్కొన్నారు. పీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా ఆధునిక సమాజంలో రేడియో పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. డాక్టర్ తిరుపాణ్యం మాట్లాడుతూ కళాశాలలో రేడియో ఎఫ్ఎంతో కలసి జర్నలిజం కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. సమాచార వ్యవస్థ గతిని మార్చేసిన ఘనత రేడియోకు దక్కుతుందని, పండిత పామరులను సైతం ప్రభావితం చేసే శక్తి రేడియోకు ఉందన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు రేడియో వినడం అలవరచుకుంటే సృజనాత్మక శక్తి పెంపొందుతుందన్నారు. సంఘమిత్ర ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి సురేంద్ర మాట్లాడుతూ స్వాతంత్య్ర సమయంలో రేడియో కీలక పాత్ర పోషించిందన్నారు. కళాశాల జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్, ఎఫ్ఎం స్టేషన్ డైరెక్టర్ సత్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోల్డెన్ టెంపుల్‌ను దర్శించిన శేషారెడ్డి దంపతులు



నారాయణి అమ్మవారి ఆశీర్వచనాలు పొందుతున్న శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు

బాలాజీచెరువు: తమిళనాడు వెల్లూరు సమీపంలో ఉన్న ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గోల్డెన్ టెంపుల్‌ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు దర్శించారు. ఆలయంలో అమ్మ అనుగ్రహం పొందిన అనంతరం ఆలయ సృష్టికర్త నారాయణి అమ్మవారి ఆశీర్వచనాలు పొంది కాకినాడకు విచ్చేయవలసిందిగా ఆహ్వానించారు. కాకినాడ ప్రజలతో పాటు తమ విద్యాసంస్థల విద్యార్థులకు ఆశీస్సులు అందజేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో వస్తానని తెలియజేశారు.

చురుగ్గా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



రత్నగిరిపై విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత (ఫైల్)

- రత్నగిరిపై రూ.4.5 కోట్లతో నిర్మిస్తున్న ఏపీఈపీడీసీఎల్
- పనులను పరిశీలించిన అధికారులు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ వెలుగులు ప్రసరించేందుకు ఉద్దేశించిన 'ఇన్‌డోర్ 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్' నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత నెల 30న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శంకుస్థాపన చేసిన విషయం విదితమే. రత్నగిరిపై సీఆర్వో ఆఫీసు పక్కన 120 అడుగుల పొడవు 80 అడుగుల వెడల్పున 1048 గజాల స్థలాన్ని దేవస్థానం కేటాయించగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) రూ. 4.5 కోట్లతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తోంది. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇది ఇండోర్ సబ్‌స్టేషన్ అవ్వడం వలన రెండు భవనాలు నిర్మించాలని, సబ్‌స్టేషన్ అంతా ఆ భవనాల్లో ఉంటుందని, భయటకు కనిపించదని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన దేవస్థానం డీఈఈ టి.సూర్యనారాయణ, రిటైర్డ్ డీఈ రాంబాబుతో కలిసి పనులను పరిశీలించారు.

మార్చి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలి

వచ్చే వేసవిలో దేవస్థానంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో మార్చి నెలాఖరు కల్లా ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేయాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను దేవస్థానం విద్యుత్ శాఖ డీఈ సూర్యనారాయణ కోరారు. అందుకు వారు సుముఖత వ్యక్తం చేశారని ఆయన వివరించారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే సత్యగిరి, రత్నగిరితో పాటు కొండ దిగువన గల సత్రాలకు కూడా నిరాటంకంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని డీఈ వివరించారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈలు సూర్యనారాయణ, దేవస్థానం అధికారులు

బాబు పర్యటనపై సమావేశం

కాకినాడ రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 15, 16 తేదీలలో తలపెట్టిన కాకినాడ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. కాకినాడలో సోమవారం రూరల్ నియోజకవర్గ నాయకులతో చంద్రబాబు పర్యటనపై సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు పిల్లి సత్తిబాబు, కాశా సత్తిబాబు, నాయకులు పెంకే శ్రీనివాసబాబా, పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.

వికాసలో నలుగురికి ఉద్యోగాలు

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఇటీవల కలెక్టరేట్ స్పందనలో దరఖాస్తు చేసుకున్న నలుగురు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు సోమవారం స్పందన హాలులో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. కె.సాయితేజ, అమరేశ్వరి, ఎస్.సౌమ్య ఐసీఐసీఐ బ్యాంకులో నెలకు రూ.22 వేల జీతంతో రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఎం.భార్గవిదేవి కాపిటల్ కన్సల్టెన్సీ సంస్థలో టెలికాలర్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో జేసీ ఇలకియా, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



కాంస్యం సాధించిన చాందిని

నాగమల్లితోట జంక్షన్: పాట్నాలోని నిర్జాంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగిన జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో కాకినాడకు చెందిన క్రీడాకారిణి చాందిని ప్రతిభను చూపి జావలిన్‌త్రో విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. 16 సంవత్సరాల విభాగంలో పుష్యమి నాగసాయి 80 మీటర్ల హర్డిల్స్‌లో 4 వ స్థానం పొందింది. వీరు ఇద్దరూ కాకినాడ జిల్లా క్రీడామైదానంలో అథ్లెటిక్స్ కోచ్ ప్రసాదరెడ్డి వద్ద శిక్షణ పొందుతున్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్‌ను డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.స్వర్గస్‌రాజు, కార్యదర్శి రంగారావు, సభ్యులు గిరి సోమవారం అభినందించారు.

బీజేపీ ఎస్సీ మోర్చా నిరశన

కాకినాడ సిటీ: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌లో రద్దయిన 26 పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద ఒక రోజు నిరహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో జిల్లాలోని పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 48 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుని సమస్య వింటున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: కాకినాడలో సోమవారం జరిగిన పోలీస్ స్పందనకు 48 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. వీటిలో సివిల్ వివాదాలకు సంబంధించినవి 18, కుటుంబ తగాదాలకు సంబంధించినవి 14, ఇతర సమస్యలకు చెందినవి 16 ఫిర్యాదులు అందాయని చెప్పారు.

పేదల కోసం సాయం




సతీష్‌కు చెక్ అందజేస్తున్న హర్ష

కాకినాడ క్రైం: కాకినాడ ఫార్మసీ అధినేత కొమ్మిశెట్టి కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు హర్ష పేదల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. సోమవారం కాకినాడలోని శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌కు హర్ష ఈ చెక్‌ను అందజేశారు.

మహాశివరాత్రికి పక్కాగా ఏర్పాట్లు

ఆర్డీవో వెంకటరమణ



మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: మహా శివరాత్రి ఉత్సవాలను భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని ఆర్డీవో బి.వెంకటరమణ కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని సామర్లకోట శ్రీచాళుక్య కుమారా రామ భీమేశ్వర స్వామి, పిఠాపురం శ్రీకుక్కుటేశ్వరస్వామి ఆలయా(పాదగయ క్షేత్రం)లలో జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 21 వరకూ జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాటు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య పనులను ప్రాధాన్యంతో నిర్వహించాలని భక్తుల రద్దీకి తగ్గట్టుగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తాగునీరు ప్రథమ చికిత్స శిబిరాలు, కోనేరు వద్ద రక్షణ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టిమ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేపడతామన్నారు. దేవదాయ, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఫిషరీస్, వైద్య, ఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వాలంటైన్స్ డే వారికి పెళ్లిరోజు!

ప్రేమికుల రోజు సందర్భంగా..



జామి కృష్ణచైతన్య, హరిణి దంపతులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కులమతాలకు అతీతంగా ప్రేమ వివాహం చేసుకొని ఎంతో హాయిగా ఉన్నారు. తొలుత ఇద్దరు కుటుంబాల్లో కూడా కులాంతర వివాహానికి ఒప్పుకొనకపోయినా పట్టుబట్టి తల్లిదండ్రులను ఒప్పించి వివాహం చేసుకొన్నారు. దంత వైద్య కళాశాల్లో చిగురించిన ప్రేమను పండించుకొని వారు నేడు ఎంతో హాయిగా జీవిస్తున్నారు. 2012లో గన్నవరంలోని సుధా, నాగేశ్వరరావు దంత వైద్యకళాశాల్లో చదువుకొనే రోజుల్లో జామి వెంకట చైతన్య సహ విద్యార్థి హరిణిని చూసి మనసు పడ్డారు. తన మనసులోని మాట చెప్పగానే ఆమె కూడా సమ్మతించడంతో ప్రేమ చిగురించింది. ఇద్దరి మతాలు వేరుకావడంతో రెండు కుటుంబాల్లోను ఈ ప్రేమను ఒప్పుకొనలేదు. కానీ తల్లిదండ్రులను ఒప్పించి 2015లో ఫిబ్రవరి 14న ప్రేమ వివాహం చేసుకొన్నారు. 2017 అక్టోబర్‌లో వీరికి ఒక అమ్మాయి పుట్టింది. ప్రస్తుతం కాకినాడలో వైద్య వృత్తిలో ఉన్న వీరు ఒకరిని ఒకరు అర్థం చేసుకొని హాయిగా జీవిస్తున్నారు. ప్రేమించడం తప్పుకాదని, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవడంలో ఎంతో ఆనందం ఉంటుందని చెబుతున్నారు. ప్రేమికుల రోజున తమ పెళ్లి రోజు కావడంతో ప్రతీ సంవత్సరం ఆ రోజున ప్రత్యేకంగా వేడుకలు చేసుకొంటామని చెప్పారు.

లయన్స్ సేవలు అభినందనీయం



శిబిరంలో పాల్గొన్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, డాక్టర్ బాలకృష్ణ

బాలాజీచెరువు: ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంలో లయన్స్ సేవలు అభినందనీయమని కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. స్థానిక 30వ వార్డులో లయన్స్‌క్లబ్ కాకినాడ అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మధుమేహవ్యాధి నిర్ధారణ, అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఈ వ్యాధిని ముందుగా గుర్తించి జాగ్రత్తలు పాటించడం ద్వారా అదుపులో ఉంచుకోవచ్చన్నారు. మారుతున్న కాలం, ఆహారపు అలవాట్ల మధుమేహం బారిన పడుతున్నారన్నారు. ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా 20 క్లబ్‌లు సంయుక్తంగా పూర్వపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 90వేల మందికి పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. శిబిరంలో భాగంగా 1,500 మందికి పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, డాక్టర్ సుబ్రమ్మణ్యం, ఎం.వెంకటరమణ, పులవర్తి సీతారామ్మూర్తి, సీమకుర్తి పాపారావు, పులవర్తి కుమార్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మేనేజర్ సత్యనారాయణ

కాకినాడ సిటీ: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు స్పందనలో అందించిన సమస్యల అర్జీలను తక్షణ పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ అధికారులను కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. ఆర్థిక పరమైన అంశాలు, న్యాయపరమైన వివాదాలు మినహా మిగిలిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సత్యనారాయణ వివరించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా వినతులు అందజేయవచ్చన్నారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు చేనేత ప్రదర్శన ప్రారంభం

కాకినాడ సిటీ: దేవాలయం వీధిలోని పైడా చలమయ్య శ్రీనివాస కల్యాణ మంటపంలో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా చేనేత ఎక్స్‌పోను కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభిస్తారు. ఈ ఎక్స్‌పోలో తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాలకు చెందిన ప్రముఖ చేనేత సంస్థలు పాల్గొని వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తాయి.